సాక్షి రంగారెడ్డి

బుధవారం । 6 । నవంబర్ । 2024



ఉపాధికి వెళ్తూ..

రోజు కూలీ ఆశతో మహిళలు పత్తితీత పనులకు క్యూ కడుతున్నారు. ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. 8లో▸



ప్రకటనలకే పరిమితం

రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్‌లో విక్రయించేందుకు వెళ్తే ధరలపై అవగాహన లేక దళారుల చేతుల్లో నష్టపోతున్నారు. 8లో▸



కొనసాగుతున్న క్రీడలు

జిల్లా స్థాయి క్రీడా పోటీలు మంగళవారం రెండో రోజుకు చేరాయన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

శాస్త్ర, సాంకేతిక రంగాలపై విద్యార్థులకు అవగాహన



కందుకూరు: జిజ్ఞాస కార్యక్రమంలో భాగంగా ఐఐసీటీ హైదరాబాద్ శాస్త్రవేత్తలు డాక్టర్ వత్సలరాణి, డాక్టర్ ఆంటోనీతో పాటు 16 మంది బృందం మంగళవారం మండలంలోని నేదునూరు మోడల్ స్కూల్‌ను సందర్శించింది. ఔషధాల తయారీ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఔషధాల కోసం చేస్తున్న పరిశోధనల గురించి విద్యార్థులకు బృందం సభ్యులు వివరించారు. హైపర్ టూప్ సిస్టమ్, హైపర్ సోనిక్స్, నానో రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర, దేశంలో ఉన్న పరిశోధనా కేంద్రాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం శాస్త్ర సాంకేతికతకు సంబంధించిన క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విష్ణుప్రియ, శాస్త్రవేత్తలు డాక్టర్ అరుణ, డాక్టర్ రాజశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైసిగండి హుండీ ఆదాయం రూ.8.94 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవత, శివాలయ రామాలయ దేవస్థానం హుండీ ఆదాయాన్ని దేవాదాయశాఖ అధికారులు మంగళవారం లెక్కించారు. మొత్తం 60 రోజులకు గాను భక్తులు కానుకల రూపేణ వివిధ హుండీల్లో సమర్పించిన ఆదాయాన్ని లెక్కించగా రూ.8,94,822 ఆదాయం సమకూరింది. ఈ మొత్తాన్ని కడ్తాల్ కెనరా బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈవో స్నేహలత, ట్రస్టీ శిరోలీ, ఆలయ నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకుడు యాదగిరిస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపటి బీసీ కమిషన్ పర్యటన వాయిదా

అనంతగిరి: కలెక్టరేట్‌లో ఈ నెల 7న జరగాల్సిన తెలంగాణ బీసీ కమిషన్ పర్యటన.. బహిరంగ విచారణ కార్యక్రమం వాయిదా పడినట్లు బీసీ వెల్ఫేర్ వికారాబాద్ జిల్లా అధికారి ఉపేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాలు, సంచార జాతులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కుల సంఘాల నాయకులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. తర్వాత పర్యటన వివరాలను త్వరలో తెలియజేయనున్నట్లు తెలిపారు.

పత్తి రైతుకు వాట్సాప్ సేవలు



కొనుగోళ్లలో సాంకేతిక పరిజ్ఞానం

- పారదర్శకంగా జరిగేలా ప్రభుత్వం చర్యలు
- క్రయవిక్రయాలకు సంబంధించి సమస్త సమాచారం
- సమస్యలున్నా ఫిర్యాదు చేసే అవకాశం

షాద్‌నగర్: పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. పత్తి పంటకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని రైతు ఇంట్లో నుంచే తెలుసుకునే విధంగా ఏర్పాట్లు చేసింది. ఇందుకు గాను మార్కెటింగ్ శాఖ వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. రైతులు తమ చేతిలో ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా పత్తి అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించి సమస్త సమాచారం తెలుసుకునే సౌకర్యం కల్పించింది. ఇందుకు గాను 88972 81111 వాట్సాప్ నంబర్‌ను కేటాయించింది. సెల్‌ఫోన్‌లో ఈ నంబర్‌కు ముందుగా నచ్చిన భాషను ఎంపిక చేసుకొని హాయ్ అని టైప్ చేసి ఎంటర్ చేయాలి. ఆ తర్వాత రైతులు క్రయవిక్రయాలకు సంబంధించి అనేక వివరాలు తెలుసుకోవచ్చు.

కొనుగోళ్లకు ఆధారే ప్రామాణికం

పత్తి పంట కొనుగోళ్లకు ప్రభుత్వం పటిష్ట ఏర్పాట్లు చేసింది. పంట అమ్మేందుకు రైతు ఆధార్ నంబర్ ప్రామాణికం. రైతులు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్‌కు విధిగా అనుసంధానం చేసుకోవాలి. పత్తిని సీసీఐ కేంద్రాలకు అమ్మకానికి వెళ్లినప్పుడు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జీరాక్స్, ఆధార్‌తో అనుసంధానమైన సెల్‌ఫోన్ నంబర్‌ను విధిగా వెంట తీసుకెళ్లాలి. వీటిని కొనుగోలు కేంద్రాల్లో అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. ఆధార్ సీడింగ్‌ను ఇష్టమైన బ్యాంకు ఖాతాకు సవరించేందుకు సంబంధిత బ్యాంకర్లను సంప్రదించాల్సి ఉంటుంది.

జిల్లాలో పత్తి సాగు వివరాలు

జిల్లాలో గత ఏడాది కంటే ఈసారి రైతులు భారీ ఎత్తున పత్తిని సాగు చేశారు. గత ఏడాది 1,27,786 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయగా ఈ ఏడాది 1,76,174 ఎకరాల్లో సాగు చేశారు. గత ఏడాదితో పోలిస్తే 48,388 ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగింది. ఈ సారి సుమారు లక్ష మెట్రిక్ టన్ను వరకు దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు.

అందుబాటులో వివరాలన్నీ..

- ఎన్ని క్వింటాళ్ల పత్తి అమ్మకానికి అర్హత ఉందో తెలుసుకోవచ్చు.
- ఏఏ మిల్లుల వద్ద అమ్మడానికి ఎంత సమయం వేచి ఉండాలో తెలుస్తుంది.
- పత్తి అమ్మకాల వివరాలు, తక్‌పట్టీల వివరాలు తెలుసుకోవచ్చు.
- పత్తి అమ్మకాలకు సంబంధించిన నగదు చెల్లింపుల వివరాలు తెలుసుకోవడంతో పాటు ఏదైనా సమస్య ఉన్నా ఫిర్యాదు చేయొచ్చు.

జాప్యం లేకుండా..



పత్తి రైతులు పంటను అమ్ముకోవడంలో ఎలాంటి జాప్యం కాకూడదనే ఉద్దేశంతో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వాట్సాప్ సేవలు అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా కొనుగోళ్లు, అమ్మకాలకు సంబంధించిన వివరాలు తెలుసుకోవచ్చు. ఫిర్యాదు చేసినా వెంటనే పరిష్కరిస్తారు.

– శ్రీనివాస్, సెక్రటరీ, షాద్‌నగర్ మార్కెట్ యార్డు

పారదర్శకంగా కొనుగోళ్లు



రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ప్రభుత్వం పారదర్శకంగా కొనుగోలు చేస్తుంది. ఇందుకు గాను సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

తూకంలో మోసం సహించం

- రైతులు నయాపైసా నష్టపోవొద్దు
- 'పట్నం' ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఇబ్రహీంపట్నం: తూకంలో మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని, నయాపైసా రైతులకు నష్టం వాటిల్లొద్దని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హెచ్చరించారు. ఇబ్రహీంపట్నంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో జరిగినట్లు ధాన్యం కొనుగోలులో రైతులను మోసం చేస్తే సహించేది లేదన్నారు. క్వింటాలుకు ఏ గ్రేడ్ రూ.2,320 మద్దతు ధర, సన్నరకాలకు అదనంగా రూ.500 బోనస్ ప్రభుత్వం చెల్లిస్తుందని స్పష్టం చేశారు. కొనుగులు కేంద్రాల సిబ్బంది, రైస్‌మిల్లర్లు రైతులను మోసం చేయకుండా సరైన తూకం వేయాలన్నారు. దళారీలను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. పండించిన పంటను నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. అన్నంపెట్టే అన్నదాతల బతుకులు బాగుపడాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎవరైనా మోసానికి పాల్పడినట్లు తెలిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్ పర్సన్ బర్ల మంగజగదీశ్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ పాండరంగారెడ్డి, డీసీఎంఎస్ డీసీఓ సుధాకర్, డీఎస్ఓ శ్రీనివాసులు, తహసీల్దార్ సునీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దిశ కమిటీ సభ్యుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామానికి చెందిన అంబోజీ శ్రీనివాస్ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ జిల్లా డెవలప్‌మెంట్ కో–ఆర్డినేషన్, మానిటరింగ్ కమిటీ (దిశ) సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం చేవెళ్ల లోక్‌సభ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, పార్టీ నియోజకవర్గ నాయకుడు అందెల శ్రీరాములును వేర్వేరుగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలత, పలువురు కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

రాజ్‌పాకాల కేసులో కొత్త కోణం

- జూబ్లీహిల్స్ పబ్ యజమాని కేదార్‌నాథ్‌కు నోటీసులు
- తాను దుబాయ్‌లో ఉన్నానని పోలీసులకు సమాచారం
- జన్వాడ పార్టీకి హాజరైన ఆయన సతీమణి రేఖ

శంకర్‌పల్లి: మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్‌పాకాల కేసులో కొత్త కోణం వెలుగుచూసింది. పార్టీలో పాల్గొని డ్రగ్ టెస్టులో పాజిటివ్‌గా తేలిన విజయ్ మద్దూరికి జూబ్లీహిల్స్‌లోని పబ్ యాజమాని కేదార్‌నాథ్‌తో సంబంధం ఉన్నట్లు మోకిల పోలీసుల విచారణలో తేలింది. గచ్చిబౌలిలో గత ఫిబ్రవరి 25న రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాడిసన్ డ్రగ్ పార్టీలో ఇతనిపై కేసు నమోదైంది. ఇదిలా ఉండగా జన్వాడలో రాజ్‌పాకాల నిర్వహించిన పార్టీలో ఆయన కనిపించలేదు.. కానీ అతని సతీమణి రేఖ విందులో పాల్గొన్నారు. రాజ్‌పాకాల భార్యతో ఆమెకు ఉన్న సాన్నిహిత్యం కారణంగానే రేఖ వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

వచ్చాక హాజరవుతా..

కేదార్‌నాథ్ జూబ్లీహిల్స్‌లో 'హై లైఫ్' పబ్‌ను నిర్వహిస్తుండేవాడు. మూడేళ్ల క్రితం పబ్‌ను ఇతరులకు అమ్మేసినట్లు సమాచారం. విజయ్ మద్దూరి కొకైన్ తీసుకున్నట్లు పాజిటివ్ రావడంతో మోకిల పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు. ఇతనితో సంబంధాలు ఉన్న కేదార్‌నాథ్ ఇంటికి నోటీసులు పంపారు. దీనిపై స్పందించిన ఆయన తాను దుబాయ్‌లో ఉన్నానని, వచ్చాక హాజరవుతానని తెలిపారు.

పోలీసులకు ఇచ్చిన ఫోన్ రేఖదే..

పార్టీలో విజయ్ మద్దూరి కొకైన్ తీసుకున్నట్లు పాజిటివ్ వచ్చింది. ఆ సమయంలో పోలీసులు విజయ్‌ని అదుపులోకి తీసుకుని ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సమయంలో విజయ్ తన ఫోన్‌కు బదులు రేఖ ఫోన్ ఇచ్చాడు. తన ఫోన్ ఇవ్వాలంటూ మరుసటి రోజు ఆమె పోలీసులను సంప్రదించడంతో విషయం బయటకు వచ్చింది. పోలీసులను తప్పుదోవ పట్టించిన ఈ అంశంలోనూ విజయ్‌పై మరో సెక్షన్ కింద కేసు నమోదు చేసిన విషయం విధితమే.

నేడు విచారణకు విజయ్

ఇటీవల అదృశ్యమైన విజయ్ హైకోర్టును ఆశ్రయించాడు. పోలీసులు తాను చెప్పిన స్టేట్‌మెంట్ కాకుండా, వేరుగా రిపోర్టు రాసినట్లు ఆరోపించాడు. విచారణ చేపట్టిన హైకోర్టు.. న్యాయవాదుల సమక్షంలో విజయ్‌ను విచారించాలని ఆదేశించింది. దీంతో బుధవారం ఉదయం 10.30 గంటలకు ఆయన మోకిల పీఎస్‌కు హాజరు కానున్నారు.

సర్వేకు సన్నద్ధం



సూపర్‌వైజర్లకు మెటీరియల్ అందజేస్తున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

- నేటి నుంచి సమగ్ర కుటుంబ సర్వే
- జిల్లా వ్యాప్తంగా 6.57 లక్షల కుటుంబాలు
- 5.344 మంది ఎన్యూమరేటర్ల నియామకం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం

ఇబ్రహీంపట్నం: సమగ్ర కుటుంబ సర్వేను బుధవారం నుంచి ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం అంతా సిద్ధం చేసింది. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కులగణన నిర్వహించాలనే ధృడ సంకల్పంతో ముందుకెళ్తోంది. గణాంకాధికారులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఆశ, అంగన్‌వాడీ, వీఓఏల(ఎస్‌హెచ్‌జీ)లకు ఇప్పటికే పలు దఫాలుగా శిక్షణ ఇచ్చారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, సమగ్ర కుటుంబ, కుల సర్వేను సర్కార్ చేపట్టనున్న నేపథ్యంలో ఇళ్ల జాబితాను ఇప్పటికే 60 శాతానికిపైగా పూర్తి చేశారు. బుధ, గురు, శుక్ర వారాల్లో మిగిలిన వివరాలను సేకరించి, యజమానులను గుర్తించి ఇళ్లకు స్టిక్కర్లు అతికిస్తారు. ప్రతి ఎన్యూమరేషన్ బ్లాక్‌లో 150 ఇళ్లు ఉంటాయి. పది బ్లాక్‌లకు ఒక సూపర్‌వైజర్ (మండల స్థాయి అధికారి) పర్యవేక్షణ ఉంటుంది.

తీరిన సిబ్బంది కొరత

తాజాగా ప్రభుత్వం ఎస్‌జీటీలను (ఉపాధ్యాయులు) కులగణన చేపట్టే కార్యక్రమంలో భాగస్వాములను చేయడంతో సిబ్బంది కొరత తీరింది. ఇంటింటికీ వెళ్లి 56 రకాల ప్రశ్నలు, మరో 21 ఉప ప్రశ్నలను సమగ్ర కుటుంబ సర్వే ప్రభుత్వం సిద్ధం చేసింది. ఎన్యూమరేటర్లకు ఇచ్చిన ఫార్మాట్ ప్రకారం ఆయా కుటుంబ వివరాలు పొందుపరుస్తారు. మున్సిపాలిటీలు మినహాయించి జిల్లాలో 5,344 మంది ఎన్యూమరేటర్లను ఈ సర్వే కోసం నియమించారు. జిల్లా స్థాయిలో స్పెషల్ ఆఫీసర్‌తో సర్వే మానిటరింగ్ కోర్ కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 6. 57 లక్షల కుటుంబాలను ఎన్యూమరేటర్లు సర్వే చేయబోతున్నారు. కుటుంబానికి సంబంధించిన అంశాలే సర్వేలో ఉన్నందున ప్రజలు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని అధికారుల సూచిస్తున్నారు.

మెటీరియల్ పంపిణీ

ఇబ్రహీంపట్నంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కృష్ణారెడ్డి హాజరయ్యారు. సూపర్‌వైజర్లకు కులగణనకు సంబంధించిన మెటీరియల్‌ను అందజేశారు. సర్వే కోసం వచ్చే అధికారులకు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ధరణి పాస్‌బుక్స్, కులం, ఓటర్ ఐడీ కార్డుల చూపేందుకు కుటుంబ యజమానులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా పకడ్బందీగా కులగణన చేపట్టేందుకు ప్రజలంతా సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో ప్రారంభించనున్న మంత్రి శ్రీధర్‌బాబు

శంకర్‌పల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను బుధవారం మున్సిపాలిటీలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని రామంతపూర్‌లో గల బద్దం మాణిక్య రెడ్డి హాలులో ఉదయం 9 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంత్రితో పాటు చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, కలెక్టర్, అదనపు కలెక్టర్ హాజరు కానున్నట్లు చెప్పారు.

పక్కాగా ఏర్పాట్లు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు జిల్లాలో పక్కాగా ఏర్పాట్లు చేసినట్టు డీపీఓ సురేష్ మోహన్ తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రామంతపూర్‌లో బుధవారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో మంగళవారం డీపీఓ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి పర్యటన నిమిత్తం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, సర్వే విజయవంతమయ్యేలా పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించినట్టు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎంపీడీఓ వెంకయ్య, తహసీల్దార్ సురేందర్, ఎంఈఓ అక్బర్, వ్యవసాయాధికారి సురేష్ బాబు, సీఐ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్త్‌సిటీ మెట్రో డీపీఆర్‌పై కసరత్తు

- ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్‌సిటీ వరకు 40 కి.మీ
- రూ.8 వేల కోట్లతో ఇప్పటికే అంచనాలు సిద్ధం
- అలైన్‌మెంట్, వయడక్ట్‌లపై అధ్యయనం
- తక్కువ భూ సేకరణతోనే నిర్మాణం
- సుమారు 20 స్టేషన్లు ఏర్పాటయ్యే అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: ఫోర్త్‌సిటీ మెట్రోపై సమగ్ర ప్రాజెక్ట్ నివేదికను (డీపీఆర్) రూపొందించేందుకు హైదరాబాద్ మెట్రోరైల్ కసరత్తు చేపట్టింది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతిపాదిత స్కిల్ యూనివర్సిటీ వరకు 40 కి.మీ మార్గంలో మెట్రో నిర్మాణానికి రెండో దశలోనే ప్రణాళికలను సిద్ధం చేశారు. రెండో దశలో ప్రతిపాదించిన 5 కారిడార్‌లకు డీపీఆర్‌లను సిద్ధం చేయడంతో పాటు మంత్రిమండలి ఆమోదం అనంతరం తాజాగా ప్రభుత్వం పరిపాలనాపరమైన అనుమతులను కూడా ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ ఐదు కారిడార్‌లపై కేంద్రం ఆమోదంతో పాటు నిధుల విడుదలైతే పనులు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలోనే రెండోదశలో భాగంగానే సుమారు రూ.8 వేల కోట్లతో ఆరో కారిడార్‌గా ప్రతిపాదించిన ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్‌సిటీ రూట్‌పై డీపీఆర్ కోసం అధికారులు దృష్టి సారించారు. దశలవారీగా అన్ని కారిడార్‌లను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఆరు కారిడార్‌లు పూర్తయితే 116.2 కి.మీ మార్గంలో మెట్రో రైల్ అందుబాటులోకి రానుంది. ఇందుకోసం సుమారు రూ.32,237 కోట్ల వ్యయం కానున్నట్లు అంచనా. ఇందులో మొదటి ఐదు కారిడార్‌లకు రూ. 24,237 కోట్లతో కార్యాచరణను సిద్ధం చేసిన సంగతి తెలిసిందే.



క్షేత్రస్థాయి సర్వే ప్రారంభం..

- ఫోర్త్‌సిటీ మెట్రో నిర్మాణాన్ని మరిన్ని ఆధునిక హంగులతో చేపట్టనున్నారు. వినూత్న రీతిలో డీపీఆర్ రూపొందించాలని ప్రతిపాదించారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రావిర్యాల, కొంగరకలాన్, మీర్‌ఖాన్‌పేట్ మీదుగా స్కిల్ యూనివర్సిటీ వరకు నిర్మించనున్న మెట్రో మార్గంపై క్షేత్రస్థాయి అధ్యయనం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. 40 కి.మీ రూట్ అలైన్‌మెంట్, వయడక్ట్‌లతో పాటు ఎక్కడెక్కడ స్టేషన్‌లను నిర్మించాలనే అంశాలపై నిపుణులు దృష్టి సారించారు. ఫోర్త్‌సిటీ వరకు సుమారు 20 మెట్రో స్టేషన్‌లను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అన్ని ప్రాంతాలకు చెందిన ప్రజలు మెట్రో సేవలను వినియోగించుకొనేవిధంగా స్టేషన్ల నిర్మాణం ఉండనుంది.
- మరోవైపు ఎయిర్‌పోర్ట్ నుంచి ఫోర్త్‌సిటీ వరకు నిర్మించనున్న ఈ రూట్‌లో చాలా వరకు ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకొని ఉన్న సర్వీస్‌రోడ్డు మార్గంలోనే మెట్రో నిర్మాణం జరగనుంది. సుమారు 25 కి.మీ వరకు సర్వీస్ రోడ్డు మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. దీంతో పెద్దగా భూసేకరణ చేయాల్సిన అవసరం ఉండదు. మిగతా ప్రాంతాల్లో మాత్రం అవసరమైన చోట భూసేకరణ చేయాల్సి ఉంటుంది. ఎయిర్‌పోర్ట్ నుంచి ఓఆర్‌ఆర్ వరకు, కొంగరకలాన్ నుంచి స్కిల్ యూనివర్సిటీ వరకు భూసేకరణ చేపట్టాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. క్షేత్రస్థాయి అధ్యయనంలో భాగంగా భూమిని నాణ్యత పరీక్షలను నిర్వహించనున్నారు. అలైన్‌మెంట్‌పై నిర్దిష్టమైన ప్రణాళికలను రూపొందించేందుకు కొంత సమయం పట్టనుందని అధికారులు చెబుతున్నారు.

రోడ్ల భూసేకరణలో భాగంగానే..

ప్రస్తుతం ఫోర్త్‌సిటీకి వివిధ రకాల అవసరాల కోసం ప్రభుత్వం భూసేకరణకు శ్రీకారం చుట్టింది. రోడ్లు, మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ హబ్స్ విస్తరణ, టౌన్‌షిప్‌లు వంటివి అందుబాటులోకి రానున్నాయి. వివిధ మార్గాల్లో 300 ఫీట్ల మేరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్లను నిర్మించేందుకు భూసేకరణ జరుగుతోంది. ఇందులో భాగంగానే మెట్రోకు అవసరమైన భూమిని కూడా సేకరించనున్నట్లు అధికారులు చెప్పారు. 'అన్ని కార్యక్రమాలు సకాలంలో పూర్తయితే రెండో దశలో ప్రతిపాదించిన మొదటి 5 కారిడార్‌లు పూర్తయ్యే నాటికి 6వ కారిడార్‌గా ఫోర్త్‌సిటీ పనులు కూడా ప్రారంభమవుతాయి' అని ఒక అధికారి అభిప్రాయపడ్డారు.

సమగ్ర సర్వేకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా సమగ్ర సర్వేకు సహకరించాలని కలెక్టర్ నారాయణ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బుధవారం నుంచి నిర్వహించే సమగ్ర సర్వేలో ప్రజలు, తమ కుటుంబంలోని స్థితిగతులకు సంబంధించి అన్ని వివరాలు సక్రమంగా ఇవ్వాలని, ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరించాలని అన్నారు. సర్వేకు సంబంధించి సమాచార సేకరణలో గ్రామస్థాయిలోని వార్డు నుంచి మొదలుకొని కేటాయించిన బ్లాక్ స్థాయి వరకు ప్రతి కుటుంబంలోని వివరాలను సమగ్రంగా సేకరించాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. అత్యంత జాగ్రత్తగా వివరాలు సేకరించాలని.. ఇచ్చిన ఫార్మాట్‌లో నమోదు చేయాలని.. నిర్వహణలో సందేహాలు తలెత్తితే వెంటనే పరిష్కరించుకుని ముందుకెళ్లాలని తెలిపారు. మూడు రోజుల పాటు ఆయా బ్లాకుల్లో ఉన్న ఇళ్ల వివరాల జాబితాను ఎన్యూమరేటర్లు సేకరిస్తారని అనంతరం 15 రోజుల పాటు ప్రతి ఇంటికీ వెళ్లి ఇచ్చిన ఫార్మాట్ ప్రకారం కుటుంబంలోని వారి వివరాలను సేకరిస్తారని చెప్పారు. సర్వే పూర్తయిన తర్వాత ఇంటికి స్టిక్కర్ అతికిస్తారన్నారు. జిల్లాలో మున్సిపల్ మినహా 5,344 మంది ఎన్యూమరేటర్లను సర్వే కోసం నియమించడం జరిగిందన్నారు. ప్రతి పది మందికి ఒక సూపర్‌వైజర్ ఉంటాడని, జిల్లాస్థాయి స్పెషల్ అధికారిని నియమించడంతో పాటు జిల్లా స్థాయిలో సర్వే మానిటరింగ్ కోర్ కమిటీని ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ వివరించారు.

ఆరు లక్షల కుటుంబాలకు..

జిల్లా వ్యాప్తంగా దాదాపు 6.57 లక్షల కుటుంబాలను ఎన్యూమరేటర్లు సర్వే చేయబోతున్నట్టు కలెక్టర్ నారాయణ రెడ్డి వెల్లడించారు. ఈ సర్వేలో కుటుంబానికి సంబంధించిన విషయాలే ఉన్నందున ఎలాంటి అపోహలు అవసరం లేదన్నారు. దీని ద్వారా కుటుంబ స్థితిగతులు, వారికి ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాల వివరాలు తెలుస్తాయన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి సౌమ్య, పౌర సంబంధాల అధికారి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

- ఫిర్యాదు చేసి నాలుగు రోజులైనా పట్టించుకోని పోలీసులు
- సీడీఆర్ రాలేదంటూ కాలయాపన

మొయినాబాద్: మిస్సింగ్ కేసుల్లో మొయినాబాద్ పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఓ బాలిక అదృశ్యమై ఐదు రోజులైనా పోలీసులు కనీసం స్పందించడంలేదు. బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసినా సీడీఆర్ రాలేదంటూ కాలయాపన చేస్తున్నారు. బాధితులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్ జిల్లా మద్దూరు మండలం గద్వ గ్రామానికి చెందిన ఆశప్ప కుటుంబం కొన్నేళ్ల క్రితం మొయినాబాద్‌కు వలస వచ్చింది. ఆశప్ప మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన చిన్న కూతురు(17) శంషాబాద్ మండలం పాలమాకుల మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదువుతోంది. దసరా సెలవులకు మొయినాబాద్‌కు వచ్చిన బాలిక బంధువుల పెళ్లి ఉండటంతో ఇక్కడే ఉంది. కాగా ఈ నెల 1న శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో బాలిక ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో ఈ నెల 2న మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసి నాలుగు రోజులైనా పోలీసులు కనీసం పట్టించుకోవడంలేదని.. సీడీఆర్ పెట్టాము.. అది రావడానికి నాలుగు రోజులు పడుతుందని చెప్పి పంపిస్తున్నారని బాలిక తండ్రి ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై నయీముద్దీన్‌ను వివరణ కోరగా మైనర్ మిస్సింగైనా.. మేజర్ మిస్సింగైనా సీడీఆర్ వచ్చేవరకు మేం ఏం చేయలేమంటూ నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారు.

రెండో దశతో నగరం నలువైపులా మెట్రో

- అన్ని రూట్లు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు అనుసంధానం
- గూగుల్ వ్యాలెట్‌ను ఆవిష్కరించిన ఎన్వీఎస్ రెడ్డి

గచ్చిబౌలి: రెండో దశ పనులు పూర్తయితే నగరం నలువైపులా మెట్రో రైలు అందుబాటులోకి వస్తుందని హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో మెట్రో రైలు ప్రయాణికుల కోసం ఆర్‌సీఎస్ గూగుల్ వాలెట్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. రెండో దశ పనులు వేగంగా ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి సీరియస్‌గా తీసుకొని సమీక్ష నిర్వహిస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ అన్ని ప్రాంతాలకు మెట్రోను విస్తరించాలని సీఎం ఆదేశించారని తెలిపారు. ప్రస్తుతం రోజుకు మెట్రో రైళ్లు 1,100 ట్రిపులు నడుపుతున్నామని, నాగపూర్ భాగస్వామ్యంతో కొత్త రైళ్లు తీసుకొస్తామని వివరించారు. ప్రయాణికుల కోసం రూట్ మొబైల్, గూగుల్ వాలెట్, మెట్రో రైలు సంయుక్తంగా డిజిటల్ వాలెట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. డిజిటల్ వాలెట్‌లో మెట్రో రైలుకు ఎక్కడి వెళ్లాలో చూపిస్తుందని, ఆటోమెటిక్‌గా పేమెంట్ చేయవచ్చన్నారు. యాపిల్ ఫోన్‌తో పాటు అన్ని రకాల ఆండ్రాయిడ్ ఫోన్లతో ఉపయోగించుకోవచ్చని ఆయన సూచించారు. ఫిజికల్‌గా టికెట్ లేకుండా ప్రయాణం చేయవచ్చారు. కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ హెచ్‌ఆర్‌ఎంఎల్ సీఈఓ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు

రాజేంద్రనగర్: మైనర్‌తో అసభ్యంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్‌కు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వేయి జరిమానా విధిస్తూ ఉప్పర్‌పల్లిలోని పోక్సో కోర్టు న్యాయమూర్తి పి.ఆంజనేయులు మంగళవారం తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపిన ప్రకారం.. బండ్లగూడకు చెందిన బాలిక దుర్గానగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. డ్రైవర్ వెంకటేశ్ (50) బాలికను ప్రతిరోజు తన ఆటోలో స్కూల్‌కు తీసుకెళ్లేవాడు. 2019 జూలై 31న స్కూల్ విడిచిన అనంతరం బాలికను ఇంటికి తీసుకెళ్లే సమయంలో స్థానికంగా ఉన్న నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక కేకలు వేస్తూ రోదించడంతో తల్లిదండ్రులకు చెబితే చంపేస్తానని బెదిరించి ఇంటి వద్ద దింపాడు. బాలికకు జ్వరం రావడంతో తల్లిదండ్రులు ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తల్లి బాలికను గట్టిగా ప్రశ్నించడంతో ఆటో డ్రైవర్ చేసిన లైంగిక దాడిని వెల్లడించింది. దీంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో న్యాయమూర్తి నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వేయి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. బాధిత బాలికకు రూ.50 వేలు అందించాలని ఆదేశించారు.

‘ధర్మయుద్ధ మహాసభను జయప్రదం చేయండి’

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ

షాద్‌నగర్‌రూరల్: తుక్కుగూడలో బుధవారం నిర్వహించనున్న మాదిగల ధర్మయుద్ధ మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

ఉపాధికి వెళ్తూ.. ఉసూరుమంటూ

- రోజు కూలీ ఆశతో పత్తితీతకు పొరుగు జిల్లాకు తరలుతున్న మహిళలు
- పరిమితికి మించి ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం
- గాల్లో కలుస్తున్న ప్రాణాలు



పత్తి తీతకు వెళ్లి ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న నందివనపర్తికి చెందిన కూలీలు



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

యాచారం: రోజు కూలీ ఆశతో మహిళలు పత్తితీత పనులకు క్యూ కడుతున్నారు. కూలీ డబ్బులతో పాటు, ప్రయాణ చార్జీలు, సాయంత్రం కల్లు, మద్యం తదితరాలు అందించడంతో మహిళలు ఈ పనులకు వెళ్లేందుకు పోటీ పడుతున్నారు. ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల్లోని నల్లవెల్లి, చింతపట్ల, మొండిగౌరెల్లి, నందివనపర్తి, నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, చౌదర్‌పల్లి, చీదేడు, దాద్‌పల్లి, రంగాపూర్, పెద్దతుల్ల తదితర గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది మహిళ కూలీలు పత్తి ఏరేందుకు వెళ్తున్నారు. ఇబ్రహీంపట్నం డివిజన్ నుంచి నిత్యం 30 ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాల్లో 1,500 మంది నుంచి 2వేల మందికి పైగా కూలీలు పత్తి ఏరేందుకు వెళ్తున్నారు. డివిజన్‌లోని పలు గ్రామాల కూలీలు మాడ్గుల్ మండలంలోని కొల్కులపల్లి, మాడ్గుల్, బ్రహ్మణపల్లి, అప్పారెడ్డిపల్లి, ఇర్విన్, సుద్దపల్లితో పాటు నల్గొండ జిల్లాలోని చింతపల్లి, మర్రిగూడ, దేవరకొండ, మల్లేపల్లి తదితర మండలాల్లోని అనేక గ్రామాల్లోని వ్యవసాయ పొలాల్లో పత్తి తీసుందెఎ వెళ్తున్నారు. ప్రతి ఏటా సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు ఈ పత్తితీత పనులుంటాయి.

పంట సాగు పెరగడంతో..

మాడ్గుల్ మండలంతో పాటు నల్గొండ జిల్లా చింతపల్లి, మర్రిగూడ, దేవరకొండ, చండూర్, గుర్రంపోడు, మల్లేపల్లి తదితర మండలాల్లో పత్తి సాగు గణనీయంగా ఉంటుంది. పత్తి అధిక విస్తీర్ణం సాగు చేయడంతో అక్కడ కూలీల కొరత కారణంగా రైతులు ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని పలు గ్రామాల్లోని మహిళ కూలీలను ఆశ్రయించి పత్తి ఏరేందుకు తీసుకెళ్తారు. రోజువారీగా కూలీ రూ.500, కిలోల ప్రకారం అయితే కిలోకు రూ.13 చొప్పున రైతులు కూలీలకు చెల్లిస్తారు. ఉదయం 9 గంటలకు వెళ్లిన కూలీలు రాత్రి 7 గంటల వరకు ఇంటికి చేరుకుంటారు. మరి కొందరు 20 మంది చొప్పున గుంపుగా ఏర్పడి ఎకరా పొలంలో పత్తి తీస్తే రూ.10వేల నుంచి రూ.15 వేలకు పైగా గుత్తాకు తీసుకుంటారు.

వాహనాల్లో కిక్కిరిసి

ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని పలు గ్రామాల నుంచి మహిళలకు స్థానికంగా ఉండే ఆటో, ఇతర వాహనాల డ్రైవర్లే పత్తి ఏరేందకు తీసుకెళ్లి తీసుకువస్తుంటారు. ఒక్కో ఆటోలో 15 నుంచి 20 మందికి పైగానే ప్రయాణిస్తుంటారు. మరికొన్ని ప్రైవేట్ వాహనాల్లో 30 మందికి పైగానే ప్రయాణిస్తుంటారు. కూలీలను తీసుకెళ్లే డ్రైవర్లకు కూలీతోపాటుగా డీజిల్ ఖర్చులు, సాయంత్రం ఖర్చులకు సైతం రైతులే చెల్లిస్తున్నారు. డ్రైవర్లు కూలీల నుంచి సైతం చార్జీలు వసూల్ చేస్తారు. ప్రవేట్ వాహనాల డ్రైవర్లు డబ్బు ఆశతో పరిమితికి మించి జనాలను ఎక్కిస్తున్నారు. యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామం నుంచి ఆటోలో 15 మందికి పైగా కూలీలు పత్తి తీతకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరగడంతో ఓ మహిళ మృతి చెందగా పలువురు కూలీలు క్షతగాత్రులయ్యారు.

పరిమితికి మించి వెళ్లొద్దు



ఆటోలో గాని, ఇతర ఏ ప్రవేట్ వాహనాల డ్రైవర్లు కూడా పరిమితికి మించి జనాలను ఎక్కించ వద్దు. పనులకు వెళ్లే కూలీలు సైతం జాగ్రత్తలు పాటించాలి. సాయంత్రం 6గంటల వరకు ఇంటికి చేరాల చూసుకోవాలి. డ్రైవర్లకు లైసెన్స్‌లు, ఇన్సూరెన్స్‌లు తప్పనిసరి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.

– లిక్కి కృష్ణంరాజు, సీఐ, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ

రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలకు వాజీద్

మహేశ్వరం: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో అండర్–14 బాలుర విభాగం రన్నింగ్ పోటీల్లో ఎండీ.వాజీద్ సత్తాచాటాడు. మండల పరిధిలోని మన్సాన్‌పల్లి చౌరస్తాలోని వైష్ణవి టెక్నో స్కూల్ విద్యార్థి వాజీద్ 400 మీటర్ల పరుగు పందెంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించి రాష్ట్ర పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా వాజీద్‌ను పాఠశాల కరస్పాండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు, విద్యార్థులు అభినందించారు.

ప్రకటనలకే పరిమితం

ఆరేళ్ల క్రితం గిడ్డంగుల నిర్మాణానికి శంకుస్థాపన

- నిధులు మంజూరైనా ప్రారంభంకాని పనులు
- పట్టించుకోని పాలకులు
- రైతన్నల ఎదురుచూపులు



ఇన్ముల్‌నర్వలో గోదాములు నిర్మించేందుకు గుర్తించిన స్థలం

కొత్తూరు: ఆరుగాలం శ్రమించి పంటలు పండించిన రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్‌లో విక్రయించేందుకు వెళ్తే ధరలపై అవగాహన లేక దళారుల చేతుల్లో నష్టపోతున్నారు. ఒక్కోమారు కనీస మద్దతు ధర లేక నష్టానికే అమ్ముకోవాల్సిన దుస్థితి. పంటల సాగు నుంచి విక్రయం వరకు ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నా.. లాభాలు లేకపోయిన వ్యవసాయం తనకు ‘వ్యయాన్నే’తప్ప సాయాన్ని మిగిల్చకున్న ఎప్పటికైనా లాభాలు వస్తాయనే నమ్మకంతో తిరిగి పంటలను సాగు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులను అధిగమించి రైతులకు లాభాలు అందించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం ప్రతీ మండల కేంద్రంలో వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేయడానికి గోదాముల నిర్మాణానికి సంకల్పించింది. వీటి వల్ల రైతులు తమ ఉత్పత్తులను ఉచితంగా గోదాముల్లో నిల్వ చేసుకోవడంతో పాటు మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉన్నప్పుడే విక్రయించుకోవచ్చు. నిల్వ చేసుకునేందుకు నిర్ణీత గడువు వరకు ఎలాంటి చార్జీలు లేకుండా రైతులకు సాయం చేయాలని గోదాముల నిర్మాణాలను చేపట్టింది.

శంకుస్థాపనకే పరిమితం

రైతుల ప్రయోజనం కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో సర్వే నంబర్ 201లో 4.20 ఎకరాల ప్రభుత్వ భూమిలో వ్యవసాయ గోదాములు నిర్మించడానికి శ్రీకారం చుట్టారు. దీంతో అప్పట్లోనే స్థానిక రెవెన్యూ అధికారులు పొలానికి సంబంధించిన సర్వేలు సైతం పూర్తి చేశారు. గోదాముల నిర్మాణానికి నాబార్డు నిధులు సుమారు రూ.3కోట్లు మంజూరైనట్లు సంబంధిత శాఖలకు చెందిన అధికారులు వెల్లడించారు. సుమారు ఐదు వేల మెట్రిక్ టన్నుల ధాన్యాలు, ఇతర ఉత్పత్తులను నిల్వ చేసుకునే విధంగా గోదాములను నిర్మించనున్నట్లు అప్పటి పాలకులు, అధికారులు ప్రకటించారు. ఆరేళ్ల క్రితం అప్పటి షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ గోదాముల నిర్మాణ పనులకు శంకుస్థాపన సైతం చేశారు. కాగా ఇప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాకపోవడంతో రైతులు తమ ఉత్పత్తులను ప్రైవేట్ గోదాముల్లో నిల్వ చేస్తు ఆర్థికంగా నష్టపోతున్నారు.

9,567 మంది రైతులకు మేలు

ఇప్పటి వరకు కొత్తూరు, నందిగామ మండలాల్లో గోదాములు లేక రైతులు మద్దతు ధర లేకున్నప్పటికీ తమ ఉత్పత్తులను తక్కువ ధరకే విక్రయించే వారు. రెండు మండలాల్లో 18 వేల ఎకరాల సాగుభూమి ఉంది. సుమారు 9,567 మంది రైతులు యాసంగి, వానాకాలం పంటలను సాగు చేస్తున్నారు. ప్రతీ వానాకాలం 63 వేల క్వింటాళ్ల వరి, 2.40లక్షల వేల క్వింటాళ్ల మొక్కజొన్న, 30 వేల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారుల లెక్కలు వెల్లడిస్తున్నాయి.

అవసరమైన చోట నిర్మిస్తాం



గిడ్డంగుల(గోదాములు) నిర్మిస్తే రైతులకు మేలు చేకూరుతుంది. గిడ్డంగుల్లో వారి ఉత్పత్తులను నిల్వ చేసుకుని మార్కెట్‌లో సరైన ధరలు ఉన్నప్పుడే విక్రయించుకోవచ్చు. నియోజకవర్గంలో రైతులకు అవసరమైన చోట తప్పకుండా వ్యవసాయ గిడ్డంగుల నిర్మాణం కోసం కృషి చేస్తాం. రైతులకు ఉపయోగం లేని చోట గిడ్డంగులు నిర్మించిన ఉపయోగం ఉండదు.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

తాళం వేసిన ఇంట్లో చోరీ

రెండు తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి వస్తువులు అపహరణ

కొత్తూరు: గుర్తు తెలియని దుండగులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటన మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్‌లో ఈ నెల 4న చోటు చేసుకుంది. సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన నలగంటి స్వామి కుటుంబ సభ్యులతో కలిసి వేరే ఊరెళ్లాడు. ఇది గమనించిన దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోని రెండు తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి వస్తులు, కొంత నగదును ఎత్తుకెళ్లారు. ఇంటికి వచ్చాక చోరీ జరిగినట్లు గుర్తించిన స్వామి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వాహనాన్ని సీజ్ చేసిన పోలీసులు



పోలీసులు సీజ్‌చేసిన వాహనం

కొందుర్గు: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనయ్య తెలిపారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. పోలీసు పెట్రోలింగ్‌లో భాగంగా మంగళవారం చిన్న ఎల్కిచర్లలో ఓ వాహనాన్ని తనిఖీ చేయగా వంద బస్తాల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. దీంతో ఆ వాహనాన్ని, రేషన్‌బియ్యాన్ని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు డ్రైవర్ సురేందర్‌ను ప్రశ్నించగా గ్రామాల్లో కొనుగోలు చేసి ఎక్కువధరకు విక్రయిస్తున్నామని వివరించాడు.

కొనసాగుతున్న జిల్లా స్థాయి క్రీడోత్సవాలు



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని ఎన్టీఆర్ విద్యాసంస్థల డీన్ రామారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడా పోటీలు మంగళవారం రెండో రోజుకు చేరాయన్నారు. క్రీడాపోటీలతో నైపుణ్యాలతో వెలికితీయవచ్చన్నారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ జోజి రెడ్డి, శ్రీనివాస్, ఏఓ సురేష్, మట్టయ్య, రిజిస్ట్రేషన్ ఉపాధ్యాయురాలు శ్రీదేవి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్‌లో కబ్జాలపై హైడ్రా సర్వే

సాక్షి, సిటీబ్యూరో: అమీన్‌పూర్ ప్రాంతంలో పార్కులు, రహదారులు కబ్జాకు గురైనట్లు స్థానికులు దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా సర్వే నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం ఇతర కీలక విభాగాలతో కలిసి అక్కడ సర్వే నిర్వహించారు. ఎకరా పైగా విస్తీర్ణంలో ఉన్న పార్కు స్థలంతో పాటు పలు రహదారులను గోల్డెన్ కీ వెంచర్ యజమానులు కబ్జా చేశారంటూ వెంకటరమణ కాలనీ వాసుల ఆరోపించారు. దీనిపై ఇరుపక్షాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కోర్టు సర్వేకు ఆదేశాలు జారీ చేసింది. మొత్తం 5 సర్వే నంబర్లలో ఉన్న 150 ఎకరాలకు పైగా ప్రాంతాన్ని హైడ్రా అధికారులు జేడీ సర్వే కార్యాలయ అధికారులతో కలిసి పరిశీలించారు. వెంకటరమణ కాలనీ, చక్రపురి కాలనీ వాసులతో పాటు గోల్డెన్ కీ వెంచర్ యజమానులు, పరిసర కాలనీ వాసులు, గ్రామస్థుల సమక్షంలో ఈ సర్వే నిర్వహించారు. లేఔట్లను పరిశీలించిన హైడ్రా సర్వే నంబర్ల ఆధారంగా పార్కు, రహదారులను పరిరక్షించడంపై దృష్టి పెట్టింది. సర్వే నంబర్లు, హద్దు రాళ్ల ఆధారంగా భూములను గుర్తిస్తున్న హైడ్రా అధికారులు ఎవరి దాంట్లోకి ఎవరు చొరబడ్డారనేది అధ్యయనం చేస్తున్నారు. ఈ సర్వేలో హెచ్‌ఎండీఏ, మున్సిపాలిటీ, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



కడ్తాల్: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన, మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ గ్రామ సమీపంలో మంగళవారం వెలుగుచూసింది. సీఐ శివప్రసాద్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ గ్రామంలోని భారత్ పెట్రోలు పంప్ సమీపంలో జాతీయ రహదారి పక్కన చెట్ల మధ్యనున్న చిన్న కాల్వలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి వయస్సు సుమారు 35 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని.. నెమలి బొమ్మలతో కూడిన ఆరంజ్ కలర్ బ్లౌజ్, ఆకుపచ్చ చీర ధరించి ఉందన్నారు. ఆమె ముఖం చుట్టూ ఆకుపచ్చ రంగు టవల్, ఓ దుప్పటి ఉందని చెప్పారు. గుర్తుపట్టలేకుండా ఉన్న మహిళను రెండు రోజుల క్రితం ఎవరో తీసుకుచ్చి ఇక్కడ పడివేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఆచూకీ తెలిసిన వారు 833399 93536, 87125 68298, 94936 28100 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కర్కల్‌పహాడ్ కార్యదర్శి మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో..



రాజేంద్రనగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ ఆరాంఘర్ ఎక్స్ రోడ్డు పిల్లర్ నంబర్ 313 సమీపంలో ఈ నెల 4న 35–40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉంది. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న రాజేంద్రనగర్ కానిస్టేబుల్ గమనించిన పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా స్థానికంగా ఆరా తీయగా అధికంగా మద్యం తాగడంతోనే ఫిట్స్ వచ్చి మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని వారు సూచించారు.

ఊపిరి పీల్చగలిగేది రెండు నెలలే!

నగరంలో జూన్, జూలైల్లోనే స్వచ్ఛమైన గాలి

సాక్షి, సిటీబ్యూరో: భాగ్యనగర ప్రజలకు స్వచ్ఛమైన గాలి లభించేది ఏడాదిలో కేవలం రెండు నెలలే. మిగిలిన పది నెలలు సగటు జీవిని వాయు కాలుష్యం వెంటాడుతోంది. రికార్డు స్థాయిలో గాలిలో నాణ్యతా ప్రమాణాలు పడిపోతున్నాయి. పెరిగిన వాహన రద్దీ, నిర్మాణ వ్యర్థాలు, తగ్గిన వృక్ష సంపద, పారిశ్రామికీకరణ తదితర అంశాలు వాయు కాలుష్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఎయిర్ ఇండెక్స్ ప్రకారం అత్యంత ప్రభావితమైన ప్రాంతాల్లో సోమాజిగూడ, గుడిమల్కాపూర్, నాచారం వంటి ప్రాంతాలు ఉన్నాయి. బంజారాహిల్స్, కోకాపేట్, మాదాపూర్, కేపీహెచ్‌బీ, మణికొండ, న్యూ మలక్‌పేట్, పుప్పాలగూడ, సైదాబాద్ వంటి ప్రాంతాల్లోనూ వాయు కాలుష్య తీవ్రత ఎక్కువగా ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గాలి స్వచ్ఛత ప్రమాణాల ప్రకారం చూస్తే నగరంలో 1.8 రెట్లు వాయు కాలుష్యం ఎక్కువగా ఉందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దేశ సరాసరి ఏక్యూఐ 142 పీఎం ఉండగా, హైదరాబాద్ సరాసరి 86 పీఎంగా ఉండటం గమనార్హం. ఈ ఏడాది జూన్, జులై నెలల్లో పూర్తి స్థాయిలో స్వచ్ఛమైన గాలి అందగా, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొద్ది రోజుల మాత్రమే గాలిలో నాణ్యత ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయి. మిగతా రోజుల్లో మోడరేట్ నుంచి ప్రమాదకర స్థాయిలో గాలిలో కాలుష్య తీవ్రత నమోదైంది.